# తపోభూమిలో పంచర్షులు

[ ప్రో. శా. ]

అది ఓ తపోభూమి. హృదయాల్లో చల్లని భావాలు రేకెత్తించే పుణ్యస్రవంతులు పారుతున్నాయచ్చటూరా. మధురఫలాలు చెట్లకు వ్రేలాడుతున్నాయి. ఆ భూమి రత్నగర్భగూడా. అక్కడ అనేకమంది ఋషులు ఆశ్రమాలు ఏర్పరచుకొన్నారు. అందరూ మేధావులు. ఆ మేధావులంతాకూడా ఓ అయిదుగురు ఋషీశ్వరుల్ని ఎన్నుకున్నారు గురువులుగా. వాళ్ళకు శుశ్రూష చేసి తరించుదామనుకున్నారు. వాళ్ళ యిష్టమొచ్చిన ఋషీశ్వరుడికి వాళ్ళు శిష్యులైపోయారు.

అంచేత ఆ తపోభూమిలో విశిష్టంగా అయిదు ఆశ్రమాలుమాత్రం విరాజిల్లుతున్నాయి.

ప్రకృతి యీ విషయాలన్నీ మనస్సుతో చెప్తోంది. కాళ్లు నడుస్తున్నాయి. ఒక ఆశ్రమం ముందు ఆగిపోయాయి కాళ్లు. చెవులు వింటున్నాయి.

"నేర్చుకోండి. అహింసనుమించిన ఆయుధం లేదు, ధర్మంలేదు, జీవితమేలేదు. సహనాన్ని పెంపొందించుకోండి."

"దుష్టులు అపకారాన్ని తలపెడితే సహనమెట్లాగురూ" ఒక పిల్లగొంతుక వినబడింది.

"అవును. దానికే ఆత్మసంయమనం కావాలి. ధర్మాన్ని పూర్తిగా అలవర్చుకుంటూ శత్రుమిత్రులను సమానదృష్టితో చూచుకుంటూ జీవించే మానవుడికి సహనం అలవర్చుకోడం ఓ గొప్ప పనికాదు. దానిలోనే జాతీయసిద్ధాంతాలన్నీ యిమిడి ఉన్నాయి."

★

కాళ్లు సాగిపోయి ఉంకో ఆశ్రమంముందు నిలబడ్డాయి. చెవులు పనిచేస్తూనే ఉన్నాయి.

"ఆనందం, శాంతి, సౌభ్రాతృత్వం ప్రతి మానవుడిలోనూ వెల్లివిరియాల్సిన భావాలు అంటోంది ఓ ఋషిగొంతుక కాబోలు.

"కాని, నాకాకలేస్తోందండి" యాచించిం కుషిక్కించిన శిష్యునిగొంతు.

"సరే, సరైనకాలానికి జ్ఞాపకంచేశావ్. విను నిజం! కడుపులో మాడుతున్నంతకాలం ఆనందం, శాంతి రావడంకల్ల. అందుకనే అభ్యుదయ గామియైన ప్రతిదేశంలోనూకూడా ఆర్థిక విప్లవ వచ్చితీరింది. సమానత్వంతో తీరిపోని సమస్య అంటూ ఉండదు. దానిలోనే యిమిడిఉం స్వరాజ్యంయొక్క పూర్ణస్వరూపం. శిష్యా సరే, మధూకరాని కెళ్ళిరా!"

★

మళ్ళీ కదిలాయి కాళ్లు. ఉంకో ఆశ్రమంలో ఉంకో ఋషి మాట్లాడుతుంటే చెవులు కాళ్ళకు బ్రేకువేశాయి.

"మార్క్సు సిద్ధాంతాలు కంఠతావచ్చాయా?"

"వచ్చాయండి."

"పెట్టుబడిదారీ విధానాన్నిగూర్చి నిన్న చెప్పిన పాఠం బాగా మెదడుకెక్కిందా?"

"ఉంకోళ్ళకు చెప్పమన్నా చెప్తానండి" అన్నది ఉంకో శిష్యంత్యంలో రాపిడితిన్న గొంతుక.

రైతుగోడు బుర్రకథ మధూకరానికెళ్ళినప్పుడు పాడారా?"

"ఆ! ప్రజలంతా తమ శక్తిని తెల్సుకున్నారండి!"

కాళ్లు కదిలాయి. ఓ గడ్డం ఋషిమించివచ్చే ప్రకాశకిరణాలు కళ్ళల్లోదూరాయి. శబ్దం చెవుల్లో దూరింది.

"శాంతి, శాంతి! స్థాపించితీరాలి"

"కాఫిర్లను నరకాలికదూ!"

"ఉత్సాహపడు, సుస్థిరంచెయ్యి నీ యిస్లాంను" హుంకరించింది ఋషిగొంతు,

"ఇదిగోనండి, కందమూలాలు తవ్వే పలుగు. సన్నద్ధంగా ఉన్నాం"

"విగ్రహారాధన కూడదు. ఎక్కడవిగ్రహం ఉన్నా సహించరాదు. కూచోండి. ఇంకా రహస్యాలున్నాయ్" ఋషిగొంతు ఆజ్ఞాపించింది.

★

మనస్సు కాళ్ళను పనిచెయ్యమన్నది. ఇంకో ఆశ్రమంవచ్చింది.

" 'నా బిడ్డల్లారా! నన్ను ప్రేమించినవాళ్లని నేను సదా ప్రేమిస్తాను' అని స్వర్గరాజ్యంలోంచి దేవుడు వాపోతున్నాడు రండి! అయనదరి జేరండి! ఆయన గ్రుడ్డివాళ్లకు కళ్లిచ్చాడు. చెవిటివాళ్లకు చెవులిచ్చాడు, మూగవాళ్లకు నోరిచ్చాడు, చచ్చిపోయినవాళ్లను బ్రతికించాడు, అయన్నినమ్మి చెడినవారు లేరు. నమ్మక చెడిపోతేపోయారు."

"అహా! ఏమి ఆనందాన్ని యిస్తారండి!" తన్మయత్వంతో ఓ గొంతుక అంది.

"మీతోపాటు జీవిస్తాడు. ఆ శిలజ్ఞాపకం తెచ్చుకోండి. అయన మహిమ మీలో ప్రవేశిస్తుంది."

★

కాళ్లు నడిచిపోయాయి. వార్తలు వచ్చాయి ఋషులంతా తపస్సులో కూచున్నారని. కొంత కాలం గడిచింది. మళ్లీ ఆశ్రమానికి కాళ్లు నడిచాయి. చతువులు పనిచేస్తున్నాయి. ఎవళ్ల ఆశయపూర్తికోసం వాళ్లు వరం సంపాయించుకోవాలనుకున్నారు. శిష్యులు తమతమ గురువులకు శుశ్రూషచేస్తున్నారు. కావల్సినవన్నీ అమరుస్తున్నారు. మా గురువెక్కువంటే మాగురు వెక్కువని శిష్యులు వాదించుకొని ఘర్షణపడుతున్నారు అవిఘ్నంగా ఋషుల తపస్సు సాగిపోతోంది.

పెద్ద తేజస్సు ఋషులముందు నిలబడింది. దాంట్లోంచి వచ్చేశబ్దం చెవుల్లోదూరి మనస్సుకిట్లా చెప్పింది.

"జయం! ఋషిసత్తములారా! మీమీ అభీష్టాలు యీడేరుస్తాను. కాని సంకుచిత అభిప్రాయాలు వదలండి. తన సిద్ధాంతాలే సర్వకాల సర్వావస్థలయందూ ప్రపంచశాంతికి మార్గదర్శకాలవుతాయన్న పిచ్చినమ్మకాన్ని మీలో ప్రతి ఒక్కరూ విడిచిపెట్టాలి! ఎవ్వరూ అహింస గెలవలేకపోవచ్చు. ఎవ్వరూ ఆర్థిక విప్లవంతోనే దేశం ముందుకువెళ్లలేకపోవచ్చు. ఎవ్వరూ ఇస్లాంమూ, క్రీస్తునూ ప్రజలు గుర్తించలేకపోవచ్చు. కాలాన్నిపట్టి మీలో ఒకొక్కక్కడు పైకివస్తాడు. అన్ని కాలాల్లోనూ మీలో ప్రతి ఒక్కరూ పైకి రావాలనే ప్రయత్నాన్ని వదులుకోండి. మీ ప్రతి ఉద్దేశమూ లోకకల్యాణానికే— కాని మీ సంఘర్షణలతో లోకనిర్యాణం సమీపిస్తోంది. మీరు కోరుతున్న ప్రతి అంశాన్ని సుస్థిరంచెయ్యడానికే నేనున్నాను. నన్ను గుర్తించండి. నావద్ద మీరు కోరే ప్రతిగుణం ఉంది. కాని దాన్ని కాలానుగుణంగా వాడుతూఉంటాను, హృదయాన్ని నామీద నిలపండి, శ్రమించండి, మీ శ్రమ నే నుపదేశించే మంత్రాలను ప్రజలచేత ఆచరణలో పెట్టించడంలో వ్యక్తమౌతుంది, ఇదిగో, మీ ఆశయాలన్నీ నా యీ ఉపదేశంలో ఉన్నాయి, శ్రద్ధధానులుకండి, అచరించండి, తరిస్తారు, 'అహింసా పరమోధర్మః—సహనావవతు, సహనౌభునక్తు,సహవీర్యం,కరవావహై, తేజస్వినావధీతమస్తు, మా విద్విషావహై, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః—సర్వేజనాస్సుఖినోభవంతు.' ప్రతి ఒక్క ఋషి తన ఆశయంతోపాటు తదితర ఋషుల ఆశయాల్నికూడా సముద్ధరించాలి, సంపూర్ణమూర్తినైన నన్ను పాసించండి, నేనే భారతీయుణ్ణి."

శబ్దం వినపడలేదు, తేజస్సు అదృశ్యమయింది. ఆ చీకట్లో ఋషులు ముక్తకంఠంతో తేజస్సులోంచివచ్చిన ఉపదేశమంత్రాల్ని ఉచ్చరించారు. కాళ్ళకు మనస్సువేసిన బ్రేకు సడలింది. సాగిపోయాయి కాళ్లు.

---

అషంశహాణి *